కాంగ్రెస్ కార్యకర్తపై బీఆర్ఎస్ కార్యకర్తల దాడి

- పోలీసులకు ఫిర్యాదు



నవతెలంగాణ-మాచారెడ్డి

మండల కేంద్రానికి చెందిన పూల రాజుపై బీఆర్ఎస్ కార్యకర్తలు దాడి నిర్వహించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి షబ్బీర్ అలీ విజయం ఖాయమంటూ మాచారెడ్డి వాట్సాప్ గ్రూప్‌లో మెసేజ్ పెట్టినందుకు కాంగ్రెస్ కార్యకర్త పూలరాజును కిడ్నాప్ చేసి ఎత్తుకెళ్లి బీఆర్ఎస్ కార్యకర్తలు దాడి చేశారని అతని భార్య స్వరూప బీఆర్ఎస్ కార్యకర్తలతో తన భర్తకు ప్రాణహాని ఉందని మాచారెడ్డి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

అణగారిన వర్గాల అక్షరాయుధం

నవతెలంగాణ

నిజాలకు నిలువెత్తు రూపం

నిజామాబాద్-కామారెడ్డి

1

ఆదివారం 20 ఆగస్టు 2023

కోటగిరి ప్రభుత్వ ఆసుపత్రి సందర్శన



నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో 50 పడకల ఆసుపత్రిగా నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో శనివారం ఆస్పత్రిని జిల్లా వైద్యాధికారి సుదర్శన్ సందర్శించారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఇందిరా క్రాంతి పథం భవనంలోకి ఆసుపత్రిలోని పరికరాలను తరలించాలని, తాత్కాలిక భవనంలో సేవలు ప్రారంభించాలని డాక్టర్ సుప్రియను ఆదేశించారు. అనంతరం లెప్రసీ సర్వే పరిశీలించారు. ఆయన వెంట ఆరోగ్య విస్తీర్ణ అధికారి గోవర్ధన్ పాల్గొన్నారు.

పోస్టాఫీస్‌లోనే మురుగుతున్న పత్రాలు

- పోస్టాఫీస్ సిబ్బంది నిర్లక్ష్యం
- నెల రోజుల తర్వాత పాస్‌పోర్ట్ అందజేత
- ప్రశ్నిస్తే.. అడ్రస్ దొరకడం లేదంటూ సమాధానం

భిక్కనూర్ పట్టణానికి చెందిన బాసం సత్యనారాయణకు నెల రోజుల క్రితమే పాస్‌పోర్ట్ రావాల్సి ఉంది. నెల గడిచినా పాస్‌పోర్టు రాకపోవడంతో రోజుల తరబడి ఎదురు చూసి.. శనివారం పోస్టాఫీస్‌కు వెళ్లి పాస్‌పోర్ట్ వివరాలు ఆరాతీయగా.. పాస్‌పోర్టును తీసిచ్చారు. గత నెల 27వ తేదీన పోస్టాఫీస్‌కు వచ్చిన పాస్‌పోర్ట్‌ను ఈనెల 19వ తేదీన పోస్టాఫీస్‌కు వెళ్తే గానీ ఇవ్వలేదు. ఇదొక్కటే కాదు.. ఇలా ఎన్నో అత్యవసరమున్న పత్రాలు సరైన సమయంలో పంపిణీ చేయడం లేదు.



నవతెలంగాణ-భిక్కనూర్

పోస్టాఫీస్‌కు వచ్చిన పత్రాలను ఏ రోజు పత్రాలు ఆ రోజు సంబంధిత వ్యక్తులకు పంపిణీ చేయాల్సిన పోస్టాఫీస్ సిబ్బంది పంపిణీ చేయకుండానే పోస్టాఫీస్ కార్యాలయంలోనే ఉంచుతున్నారు. ఎందుకు పంపిణీ చేయడం లేదని బాధితులు అడిగితే అడ్రస్ దొరకడం లేదని డొంగ తిరుగుడు సమాధానం చెబుతున్నారు. సొంత గ్రామంలో నివసిస్తున్న వ్యక్తుల సమాచారం కూడా 'పోస్టాఫీస్ సిబ్బందికి అడ్రస్ దొరకడం లేదా..?' అంటూ బాధితులు ఆరోపిస్తున్నారు.

భిక్కనూర్ మండల కేంద్రంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల సమీపంలో మెయిన్ పోస్టాఫీస్ ఉంది. ప్రతిరోజు ఇతర గ్రామాలకు వెళ్లాల్సిన పత్రాలు ప్రధాన పోస్టాఫీస్‌లో డిస్ట్రిబ్యూషన్ అవుతాయి. మండలంలో 18 గ్రామ పంచాయతీలలో కొన్ని గ్రామాలకు పోస్ట్ ఆఫీస్ పత్రాలు సరైన సమయానికి వెళ్తున్నా, మరికొన్ని గ్రామాలకు మాత్రం నెలరోజులైనా రావడం లేదని గ్రామస్తులు, బాధితులు ఆరోపిస్తున్నారు.



భిక్కనూర్‌లో పోస్టాఫీస్

ప్రస్తుత ఇంటర్నెట్ కాలంలో బ్యాంకు ఏటీఎం, పాస్‌పోర్ట్, పాన్‌కార్డు, ఎల్ఐసీ బాండ్, ఇతర ప్రభుత్వ కార్యాలయ కొన్ని పత్రాలు మాత్రమే పోస్టాఫీస్‌లో వస్తున్నాయి. వచ్చిన పత్రాలను సరైన సమయంలో అందించాల్సిన పోస్ట్ ఆఫీస్ సిబ్బంది నాకేం అవసరం అన్నట్టు పోస్ట్ ఆఫీస్‌లోనే ఉంచి నా పత్రాలు వచ్చాయా అని పోస్ట్ ఆఫీస్‌కి వెళ్లి అడిగితేనే వెతికి ఇస్తున్నారు. ఎందుకు ఇవ్వలేదని బాధితులు ప్రశ్నిస్తే 'మీ అడ్రస్ దొరకలేదు. మీ ఇంటికి వచ్చినప్పుడు ఎవరు లేరు.' అంటూ పొంతన లేని సమాధానం చెబుతున్నారు.

పోస్టాఫీస్‌కి వచ్చిన పత్రాలు అడ్రస్ తెలిస్తేనే పంచుతున్నారు, తెలియకపోతే పోస్ట్ ఆఫీస్ లోనే ఉంచుతున్నారు. అత్యవసర పత్రాలు కూడా పోస్ట్ ఆఫీస్‌లోనే ఉంచి బాధితుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆలస్యంగా పంపిణీ చేసే చర్యలు తప్పవు

పోస్టాఫీస్‌కు వచ్చిన పత్రాలు ఆలస్యంగా వస్తున్నాయని తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, ఆలస్యంగా పంపిణీ చేస్తే బాధితులు పోస్టాఫీస్‌లో ఫిర్యాదు చేయాలి. పోస్టాఫీస్ సిబ్బంది ఆలస్యంగా పత్రాలను పంపిణీ చేస్తే తగిన చర్యలు తీసుకుంటాం. - పోస్ట్ మాస్టర్ మహేందర్

కమ్మర్‌పల్లిలో భారీవర్షం

- కోతకు గురైన బీటి రోడ్లు
- నీట మునిగిన సోయా, వరి పంటలు
- వరద నీటిలో చిక్కుకున్న స్కూల్ బస్సు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలో శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు కమ్మర్‌పల్లి సెక్టార్‌లో 90.2 మిల్లి మీటర్లు, కోనాసముందర్ సెక్టార్‌లో 100.3 మిల్లి మీటర్ల భారీ వర్షం కురిసింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకూ ఏకధాటిగా భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు చేరింది. మండల కేంద్రం నుంచి ఉప్లూర్ వెళ్లే దారిలో వరద కాలువ సమీపంలోని కల్వర్టు వద్ద బీటి రోడ్డు పైనుంచి వరద నీరు పెద్ద ఎత్తున ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. కల్వర్టు సమీపంలోని సోయాబీన్, వరి పోలాలు నీట మునిగాయి.

కోతకు గురైన బీటి రోడ్లు..

భారీ వర్షంతో వచ్చిన వరద నీటికి ఉప్లూర్ నుంచి మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ వెళ్లే, ఉప్లూర్ పరిధిలోని దమ్మనపేట్ నుంచి నాగాపూర్ వేళ్లే బీటి రోడ్లు కొతకు గురయ్యాయి. తిమ్మాపూర్ దారిలో ఉన్న కల్వర్టు వద్ద బీటి రోడ్డు కొతకు గురైంది. గతంలో కురిసిన వర్షాలకు కల్వర్టు మీద రెండు వైపుల బీటి రోడ్డుకు పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. అధికారులు స్పందించకపోవడంతో రాత్రి కురిసిన భారీ వర్షంతో వచ్చిన వరద తాకిడికి కల్వర్టు సమీపంలో బీటి రోడ్డు పెద్ద ఎత్తున కోతకు గురైంది. ఈ రోడ్డు గుండా తిమ్మాపూర్ వెళ్లే ప్రయాణికులతో పాటు పంట పొలాలకు రైతులు రాకపోకలు సాగిస్తారు. రోడ్డు పెద్ద ఎత్తున కోతకు గురవ్వడంతో రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంది. కాలినడకన కూడా రోడ్డును దాటలేని పరిస్థితి ఉంది. రోడ్డు కోతకు గురవ్వడంతో ఇరువైపులా ఉన్న పంట పొలాలు పూర్తిగా నీటమునిగాయి. దమ్మనపేట్ నుంచి నాగాపూర్ వేళ్ల బీటి రోడ్డు భారీ వర్షంతో కోతకు గురైంది. ఈ రోడ్డు ఇప్పటికే మూడు సార్లు కోతకు గురైంది. అధికారులు తూతూ మంత్రంగా కోతకు గురైన చోట మొరం నింపి చేతులు దులుపుకున్నారు. రాత్రి కురిసిన వర్షంతో మరోసారి ఈ బీటి రోడ్డు కొతకు గురైంది. ఈ దారిలో విద్యార్థులను తీసుకొని వెళ్తున్న ఓ పాఠశాల బస్సు వరద నీటిలో చిక్కుకుంది. బస్సు ఒక పక్కకు ఒరగడంతో అప్రమత్తమైన డ్రైవర్ విద్యార్థులను వెంటనే కిందకు దింపడంతో ప్రమాదం తప్పింది. ఈ బీటి రోడ్డుపై నుండి వర్షం నీరు ఎత్తన ప్రవహిస్తుడడంతో రాకపోకలను నిలిపివేశారు.



నీటిలో చిక్కుకున్న స్కూల్ బస్సు

నీటమునిగిన పంటలు..

భారీ వర్షంతో వచ్చిన వరదలకు పంట పొలాలు దెబ్బతిన్నాయి. నెలరోజుల క్రితం కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని మళ్ళీ సాగుకు అనుకూలంగా మలుచుకున్నారు. తిరిగి మళ్ళీ కురిసిన వర్షంతో మరోసారి పంట పొలాల్లో ఇసుకమేటలు వేశాయి. పొలాల గట్లు కోతకు గురయ్యాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. పలు చోట్ల సోయాబీన్ పంట నీట మునిగింది.



కోతకు గురైన బీటీ రోడ్డు



పంటపొలంలో ఇసుక మేటలు

మైనారిటీ బంధు చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-తాడ్వాయి

మైనార్టీ నిరుపేదల జీవితాలలో వెలుగులు నింపే విధంగా ప్రభుత్వం చేయూత నిస్తోందని ప్రభుత్వ విప్, కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్లో శనివారం జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి పథకం కింద మైనార్టీ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక సాయంతో చిన్న, చిన్న వ్యాపారాలు చేపట్టి ఆర్థికంగా బలోపేతమై ఇతరులకు మైనార్టీ సోదరులు స్ఫూర్తిగా నిలవాలని కోరారు. ఇటీవల 300 మంది బీసీ, కుల వృత్తుల వారికి జీవనోపాధి కల్పించడానికి ప్రభుత్వం రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు. పేద మైనార్టీ విద్యార్థులకు విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించడం కోసం ప్రభుత్వం 20 లక్షల రూపాయలు ఆర్థిక సాయం ఉచితంగా ఇస్తుందని చెప్పారు. కుల, మత బేధం లేకుండా ముఖ్యమంత్రి కెసిఆర్ నేతృత్వంలో ప్రభుత్వం అన్ని వర్గాల పేదలకు ఆర్థిక సాయం అందజేస్తూ వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నారని తెలిపారు.

కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ

నవతెలంగాణ-నిజాంసాగర్

మండలంలోని మల్లూరు గ్రామంలో కళ్యాణలక్ష్మి చెక్కులను ఎంపీపీ పట్లోళ్ల జ్యోతి దుర్గారెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దుర్గారెడ్డి మాట్లాడుతూ.. పేదవారికి ఆడపిల్ల భారం కాకూడదనే ప్రభుత్వం కళ్యాణలక్ష్మి పథకం ఏర్పాటు చేసిందని, ఈ పథకం పేదవారికి ఎంతో న్యాయం చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో మల్లూరు సర్పంచ్ బాబుసేట్, మొగులానా, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీబీసీ పాఠశాల యజమానిపై ఎఫ్ఐఆర్ నమోదు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగరంలోని బీబీసీ పాఠశాలలో బుధవారం (ఈనెల 16న) జరిగిన ఘటనపైన పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. బీబీసీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని ఫీజు చెల్లించడం లేదని పాఠశాల యజమాని ప్రవీణ్ విద్యార్థిని ఎండలో నిలబెట్టడమే కాకుండా తాను బైక్ పైన విద్యార్థినిని ఎక్కించుకొని నగరం మొత్తం తిప్పడం సక్రమమైన పద్ధతి కాదని తల్లిదండ్రులు గురువారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. విద్యార్థిని తల్లిదండ్రులు ఖచ్చితంగా చర్యలు తీసుకోవాలని పట్టుబట్టడంతో పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

మీ ఉజ్వల భవితకు మీరే నిర్దేశకులు

- పట్టుదలతో కృషి చేస్తే అద్భుత విజయాలు వరిస్తాయి
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి
- ఎస్సెస్సీ టాపర్లకు అవార్డులు ప్రదానం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

మీ ఉజ్వల భవితకు మీరే మార్గనిర్దేశకులని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి విద్యార్థులను ఉద్దేశించి ఉద్బోధించారు. అదృష్టంపై ఆధారపడకుండా ఏకాగ్రత, పట్టుదలతో కృషి చేస్తే ఉన్నత అవకాశాలు ఆహ్వానం పలుకుతాయని, అద్భుత విజయాలు వరిస్తాయని అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో శనివారం చిట్ల ప్రమీల జీవన్‌రాజ్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు వీలుగా ప్రతియేటా నిర్వహిస్తున్న ఆనవాయితీని పాటిస్తూ 'విద్యా స్ఫూర్తి' కార్యక్రమం నిర్వహించారు. పదవ తరగతి వార్షిక పరీక్షల్లో టాపర్లుగా నిలిచిన ఆర్మూర్ పట్టణంలోని నాలుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ తన తల్లిదండ్రుల పేరిట నెలకొల్పిన ట్రస్టు ఆధ్వర్యంలో అవార్డులు ప్రదానం చేశారు. బంగారు, వెండి పతకాలను బహూకరించి, చిన్నారులకు ప్రోత్సాహకాలు అందజేశారు. జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, ఆర్మూర్ ఆర్డీఓ వినోద్‌కుమార్ తదితరులు పాల్గొని విద్యాస్ఫూర్తి కార్యక్రమానికి వన్నెలద్దారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి విద్యార్థులను ఉన్నత లక్ష్యాల దిశగా పయనించేలా ప్రభావవంతమైన ప్రసంగంతో అందరిలోనూ స్ఫూర్తిని పెంపొందించారు. మనం పెరిగే వాతావరణం, ఆలోచనా తీరుపైనే మేధస్సు అనేది ఆధారపడి ఉంటుందని, సానుకూల దృక్పథంతో ప్రణాళికాబద్ధంగా శ్రమిస్తే విజయం తథ్యమని సూచించారు. ఇతరులను నిందించడం మానుకుని, మన ఎదుగుదలకు దోహదపడేలా ముందుకు సాగాలని హితవు పలికారు. సమాజానికి సరైన దశ, దిశ చూపే గురుతర బాధ్యత కలిగిన గురువులు విద్యార్థుల భవితవ్యాన్ని తీర్చిదిద్దేందుకు అంకిత భావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. బండరాయిని ఓ శిల్పి ఎలాగైతే దేవతామూర్తి విగ్రహంగా చెక్కి పూజలందుకునేలా చేస్తాడో, ఉపాధ్యాయులు కూడా అదే స్ఫూర్తితో పిల్లల్లో సామాజిక స్పృహ, సానుకూల దృక్పథాన్ని పెంపొందిస్తూ, చక్కటి విద్యా బోధన అందించడం ద్వారా వారి ఉన్నతికి దోహదపడి గురువు స్థానానికి సార్థకత చేకూర్చాలన్నారు. కౌమార దశ ఎంతో సున్నితమైందని, ఈ వయసులోని పిల్లలను సరైన దిశగా ప్రోత్సహిస్తే వారు అద్భుతాలు సృష్టిస్తారని అన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో విద్య ఎంతో ప్రాముఖ్యమైనదని, విద్యతోనే సమాజంలో తగిన గుర్తింపు, గౌరవం లభిస్తాయని, మన విలువను పెంపొందించుకోగల్గుతామని మార్గనిర్దేశం చేశారు. పేద కుటుంబాలకు చెందిన వారు సైతం తమ పిల్లలు ఉన్నత స్థానాల్లో ఉండాలని ఆశిస్తూ రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడి చదివిస్తున్నారని, విద్యార్థులు వారి ఆశలను వమ్ము చేయకుండా కన్నవారి ఆశయాలను అనునిత్యం స్మరించుకుంటూ అంకితభావంతో చదవాలని సూచించిన సందర్భంగా కమిషనర్ పార్థసారథి ఒకింత భావోద్వేగానికి లోనయ్యారు. అవసరమైతే తమ తల్లిదండ్రుల ఫోటోను ముందర పెట్టుకుని లక్ష్యం దిశగా ముందుకు సాగాలని తెలిపారు.



అవార్డులు అందజేస్తున్న దృశ్యం

చదువుకు అడ్డంకిగా మారే సెల్ ఫోన్, సినిమాలు, సీరియళ్లు వంటి వాటికి బానిసలుగా మారకుండా, ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని పక్కా ప్రణాళికతో కృషి చేయాలన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు, యువత సైతం తమ సృజనాత్మక శక్తిని పెంపొందించుకుని నైపుణ్యాలను మెరుగు పర్చుకోవాలని కమిషనర్ పార్థసారథి సూచించారు. ప్రస్తుత జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతును ఆదర్శంగా తీసుకుని చదువులో రాణించాలని పిలుపునిచ్చారు. కాగా, తన తల్లిదండ్రుల పేరిట నెలకొల్పిన చిట్ల ప్రమీల జీవన్ రాజ్ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో 2008 నుండి విద్యా ప్రోత్సాహక కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి వెల్లడించారు. ఇందులో భాగంగా విద్యార్థుల కెరీర్ కు, పోటీ పరీక్షలలో విజయానికి దోహదపడే విధంగా నిపుణులైన మల్లికార్జున్ చే హ్యాండ్ రైటింగ్ శిక్షణ ఇప్పిస్తున్నామని, పట్టాభిరామ్ చే వ్యక్తిత్వ వికాసం తరగతులు నిర్వహింపజేస్తున్నామని తెలిపారు. అలాగే ఉపాధ్యాయులకు నైపుణ్యాభివృద్ధి కోసం శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని అన్నారు.

కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, ప్రభుత్వ బడులలో చదివే విద్యార్థులు కూడా ఉన్నత స్థానాలు అధిరోహించవచ్చు అనడానికి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి ఎదుగుదల చక్కటి నిదర్శనమని అన్నారు. ఉన్నతమైన రాజ్యాంగ పదవిలో కొనసాగుతూ, తాను పుట్టిపెరిగిన ప్రాంతం, చదువుకున్న బడిని మర్చిపోకుండా విద్యార్థులను ప్రోత్సహించేందుకు తల్లిదండ్రుల పేరిట ట్రస్టును నెలకొల్పి అవార్డులు అందిస్తుండడం ఎంతో గొప్ప విషయమని అన్నారు. ఆర్మూర్‌లోని నాలుగు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎంతో అదృష్టవంతులని, వారికి కమిషనర్ పార్థసారథి రూపంలో తోడ్పాటు లభిస్తోందని అన్నారు. ఈ సందర్భంగా ఎస్సెస్సీలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు అవార్డులతో సత్కరించి ప్రోత్సాహకాలను అందజేశారు. కార్యక్రమంలో విద్యా శాఖ పరీక్షల విభాగం సహాయ కమిషనర్ విజయభాస్కర్, ఎంఈఓ రాజ్ గంగారాం, ట్రస్టు కన్వీనర్ నర్సింలు, పాఠశాల హెచ్.ఎం కవిత తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ఇంటర్ అడ్మిషన్లకు ఆగస్టు 21 నుంచి 28 వరకు స్పాట్ కౌన్సెలింగ్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండల పరిధిలోని బాలికల గిరిజన గురుకులం కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ ప్రవేశాల కోసం ఆగస్టు 21 నుంచి 28 వరకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ఆ సంస్థ ప్రాంతీయ సమన్వయకర్త టి.సంపత్ కుమార్ ఆదేశాల మేరకు గిరిజన కళాశాల ప్రిన్సిపాల్ కె.రమ్య ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 2023లో 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థినులు టీసీ, బోనాఫైడ్, కుల, ఆదాయం, నివాస, ఫిజికల్ ఫిట్‌నెస్, 8 పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, తీసుకొని స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు. ఈ కౌన్సెలింగ్ 21వ తేదీ ఉదయం 11 గంటల నుంచి నిర్వహిస్తామని తెలిపారు. ఖాళీల వివరాలు ఎంపీసీ విభాగంలో ఎస్సీ 1, బీసీ 1, ఓసి 1, ఎస్టి 16, బైపీసీ విభాగంలో బీసీ 1, ఓసి 1 ఖాళీలు ఆధారంగా మెరిట్ మేరకు సీట్లను కేటాయించనున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు వినియోగించుకోవాలని కోరుతున్నారు.

సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి మోసపోయిన వ్యక్తి

నవతెలంగాణ-రామారెడ్డి

సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి వ్యక్తి మోసపోయిన ఘటన మండలంలోని గిద్ద గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ సుధాకర్ వివరాల ప్రకారం.. గిద్ద గ్రామానికి చెందిన కాస్తరి మధుసూదన్ ఈనెల 12వ తేదీన కారు కొనుగోలు చేసేందుకు ఫేస్‌బుక్‌లో వెతుకుతుండగా.. ఈకో కారు కేవలం రూ.80వేలకు విక్రయానికి ఉందని, రూ.3000 చెల్లించి కారు బుక్ చేసుకోవాలని సైబర్ నేరగాడు సూచించగా.. 8486510272కు రూ.3000 ఫోన్ పే ద్వారా పంపించి.. 13వ తేదీ నాడు 7430912940 ఫోన్ నుంచి ఫోన్ చేసి ఈకో కారు కార్గోలో పంపిస్తాను రూ.11,500 పంపించాలని సూచించగా మోసపోయానని తెలిసి 1930కు ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని కొండాపూర్ గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణానికి శనివారం సర్పంచ్ వెలిశాల సత్యనారాయణ చేతుల మీదుగా భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెలిశాల సత్యనారాయణ మాట్లాడుతూ.. కొండాపూర్ గ్రామ పంచాయతీకి గ్రామ పంచాయతీ భవనం లేకపోవడంతో ఎల్లారెడ్డి శాసనసభ్యులు సురేందర్ నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఎమ్మెల్యే ఆదేశానుసారం భూమిపూజ నిర్వహించారు. గ్రామపంచాయతీ భవనం నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసినందుకు గ్రామ పంచాయతీ పాల్గొన్న సభ్యులు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సందీప్ గౌడ్, ఎంపీటీసీ సర్వన్‌నాయక్, కార్యదర్శి జైలెసింగ్ సాయగౌడ్, కాశీరాం, గ్రామ పంచాయతీ పాలకవర్గసభ్యులు, గ్రామపెద్దలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పటిష్టమైన ప్రజాస్వామ్య నిర్మాణానికి ఓటు వజ్రాయుధం

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-తాడ్వాయి

పటిష్టమైన ప్రజాస్వామ్య నిర్మాణానికి ఓటు వజ్రాయుధంలాంటిదని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం నిజాంసాగర్ చౌరస్తా నుంచి కళాభారతి వరకు 'ఐ ఓట్ ఫార్ ష్యూర్' అంశమై నిర్వహించిన 5 కె రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరుగా నమోదు కావడం, ఓటు హక్కు వినియోగించుకోవడం తదితర అంశాలపై అవగాహనా కల్పించే నిమిత్తం రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కామారెడ్డితో పాటు ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాలలో 5కే రన్ నిర్వహించామన్నారు. వర్షం పడుతున్నా యువత ఎంతో ఉత్సాహంతో పరుగులో పాల్గొనడం సంతోషంగా ఉందని కలెక్టర్ అన్నారు. ఈవీఎంల ద్వారా ఎలా ఓటు వేయాలో తెలియజేస్తూ సంచార వాహనాల ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఓటు హక్కు మన జన్మ హక్కు అని, ఓటు ప్రాధాన్యతను గుర్తించి ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఈ నెల 26, 27న తిరిగి సెప్టెంబర్ 2, 3 తేదీలలో పోలింగ్ బూతు స్థాయిలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టామని, ప్రతి ఒక్కరు బూతు స్థాయి అధికారుల వద్ద ఉన్న ముసాయిదా ఓటరు జాబితాలో తమ పేరును సరిచూసుకుని మార్పులు, చేర్పులు ఉంటే సరిచేసుకోవాలని సూచించారు. ఈ 5 కె రన్‌లో మున్సిపల్ కమిషనర్ దేవేందర్, డీఎల్‌పీఓ సాయిబాబా, తహసీల్దార్ సాయిలు, ఉద్యోగులు, యువత పాల్గొన్నారు.



చెట్టుకు ఢీకొని యువకుని మృతి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఘన్‌పూర్ గ్రామానికి చెందిన యమ్మాజి విష్ణువర్ధన్ (32) మండలంలోని ముల్లంగి గ్రామం వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి చెట్టుకు ఢీకొని మృతి చెందినట్లు ఎస్సై యు మాహేష్ శనివారం తెలిపారు. ఘన్ పూర్ గ్రామానికి చెందిన విష్ణు వర్ధన్ పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై ముల్లంగి వెళ్తుండగా గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తూ ద్విచక్ర వాహనం చెట్టుకు ఢీ కొనడంతో తీవ్రగాయలై అక్కడికక్కేడే మృతి చెందాడు. మృతుని భార్య యమ్మాజి జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని మార్చురీకి తరలించినట్లు ఎస్సై మాహేష్ తెలిపారు.


విష్ణువర్ధన్ (ఫైల్)

నుడా ఛైర్మన్‌ను సన్మానించిన ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ- జక్రాన్‌పల్లి

నూతనంగా నియమించబడ్డ నుడా ఛైర్మన్ సంజీవరెడ్డిని మండల ప్రజాప్రతినిధులు శనివారం ఘనంగా సన్మానించారు. ఎంపీపీ కుంచాల విమల రాజు, వైస్ ప్రెసిడెంట్ ముసుకు తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ మైదం రాజన్న శాలువాలతో ఘనంగా సన్మానించారు.



దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి వసతి సౌకర్యం ఇవ్వాలి

- వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి
- పీడీఎస్‌యూ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ సూపరింటెంట్‌కు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పిడిఎస్యు) ఆధ్వర్యంలో శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఎం. నరేందర్, ప్రధాన కార్యదర్శి కర్క గణేష్ మాట్లాడుతూ, జిల్లా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్ ఇలాఖాలోని గురుకుల పాఠశాల నిర్మాణ దశకు నోచుకోక ఆర్మూర్‌కేంద్రంగా అద్దె భవనాల్లో, ఇతర హాస్టల్స్‌లో ఉండడం సిగ్గుచేటని అన్నారు. పెండింగ్ లో ఉన్న మెస్ బకాయిలు, కాస్మోటిక్ చార్జీలు వెంటనే విడుదల చేయాలని, పెరిగిన మెస్ చార్జీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అద్దె భవనాల్లో ఉన్న సంక్షేమ హాస్టళ్లకు లక్షల రూపాయలు ప్రతి నెల వెచ్చిస్తున్నారని, కానీ సొంత భవనాలు నిర్మించడంలో ప్రభుత్వం మొండి వైఖరి వీడనాడాలని తెలిపారు. అర్బన్ ఎమ్మెల్యే బిగల గణేష్ గుప్త నగరాన్ని వీధి దీపాలతో అలంకరిస్తున్నారే కానీ విద్య వ్యవస్థను మాత్రం గాలికి వదిలేస్తున్నారన్నారు. వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి కూతురు ఎమ్మెల్సీగా ఉండి, ముఖ్యమంత్రి కుడి భుజం అయిన వేముల ప్రశాంత్ రెడ్డి జిల్లాలో సమస్యలకు నిలయంగా ప్రభుత్వ సంక్షేమ హాస్టల్ తయారయ్యాయన్నారు. వెంటనే విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ప్రతి హాస్టల్లో మౌలిక సదుపాయాలు, మంచినీటి సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిడిఎస్యు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.కే అషఉర్, అనిల్, కోశాధికారి నిఖిల్, జిల్లా నాయకులు మహిపాల్, నవీన్ ,నాగేష్, సలీం, నితిన్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేసి మాట్లాడుతున్న నాయకులు

పట్టణంలో 5కే రన్



రన్‌లో పాల్గొన్న అధికారులు

నవతెలంగాణ ఆర్మూర్

జిల్లా కలెక్టర్, ఆదేశాల మేరకు శనివారం. 5కె రన్ ప్రోగ్రాం శనివారం నిర్వహించారు. మామిడిపల్లి ఎక్స్ రోడ్డు నుండి అంబేద్కర్ చౌరస్తా, వరకు రన్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీవో వినోద్ కుమార్ ఏసీపీ జగదీష్ చందర్ తహశీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్, ప్రసాద్ చౌహన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేల్పూర్‌లో భారీ వర్షం

నవతెలంగాణ - వేల్పూర్

బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావంతో బాల్కొండ నియోజకవర్గం మండలాల్లో శుక్రవారం రాత్రి నుండి కురుస్తున్న వర్షాలకు చెరువులు, వాగులు చెక్ డ్యాములలో నీరు చేరి పొంగుతున్నాయి. రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించింది కేసీఆర్ మాత్రమే

- ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి


భూమిపూజ చేస్తున్న ఎంపీపీ

నవతెలంగాణ-ధర్పల్లి

రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సముచిత స్థానం సల్పించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసింది కేసీఆర్ మాత్రమేనని ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి అన్నారు. శనివారం ఆమె మండలంలోని వాడి గ్రామంలోని ముదిరాజ్ కులస్థులకు మంజూరైన 5 లక్షల నిధులతో నూతన భవనానికి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న రోజుల్లో కేసీఆర్ ప్రభుత్వాన్ని ప్రజలు మళ్లి పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బాగవ్వ నాయకుడు గంగారెడ్డి, ప్రభు, శ్రీనివాస్, భూమయ్య, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి ఇవ్వాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-సిరికొండ

డిగ్రీ చదివిన ప్రతి ఒక్క విద్యార్థి నిరుద్యోగికి నిరుద్యోగ భృతి 3016 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం బిజెవైఎమ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు సందగిరి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.... తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ నిరుద్యోగులు అయిన డిగ్రీ విద్యార్థులకు నిరుద్యోగ భృతి ఇస్తానని 56 నెలలు అవుతుందన్నారు. లెక్కన ఒక్క నిరుద్యోగికి లక్ష 68వేల 896 రూపాయలు చెల్లించాలని అన్నారు. 3 సంవత్సరాలుగా ఉద్యోగాలు భర్తీ చేయలేదని,ఇకనైనా కళ్ళు తెరిచి ముఖ్యమంత్రి చెప్పిన ఇచ్చిన వాగ్దానం నెరవేర్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రంజిత్ రెడ్డి,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల్లో లబ్దిపొందేందుకే డిగ్రీ కళాశాల జీవో

- బీజేపీ మండల అధ్యక్షుడు అంబటి నవీన్

నవతెలంగాణ-బాల్కొండ

ఎన్నికల్లో లబ్దిపొందేందుకే డిగ్రీ కళాశాల జీవో తెచ్చారని బీజేపీ మండల అధ్యక్షుడు అంబటి నవీన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి వేములప్రశాంత్ రెడ్డి శుక్రవారం బాల్కొండ మండల కేంద్రానికి నూతన డిగ్రీ కళాశాల మంజూరు చేసిన జీవో తీసుకువచ్చారన్నారు. సంవత్సరం డిగ్రీ విద్యార్థులకు కౌన్సిలింగ్ పూర్తి అయిన తర్వాత రోజే ఈ జీవో తీసుకువచ్చి విద్యార్థులను ఈ ఏడాదికి చదువుకు దూరం చేశారన్నారు. మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఉంటే ఎంతోమంది విద్యార్థులు పట్టుభద్రు లుగా ఉండేవారని తెలిపారు. కార్యక్రమం లో బీజేవైఎం మండల అధ్యక్షుడు శ్రీకాంత్, ప్రధానకార్యదర్శి రామన్ శివ, ఐటీ సెల్ కన్వీనర్ కొత్తింటి రాకేష్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అంబటి నవీన్

బీఆర్ఎస్ బూత్ కమిటీల ఏర్పాటు


కొత్తగా ఏర్పడిన భూత్ కమిటీ సభ్యులు

నవతెలంగాణ-నందిపేట్

ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త తమ స్వంత పనిని ఒక్కరోజు వాయిదా వేసుకోనైనసరే ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి గెలుపు కోసం కంకణం కట్టుకోవాలని ఎంపిపి వాకిడి సంతోష్ రెడ్డి, వైస్ ఎంపిపి దేవేందర్, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ సభ్యుడు వెల్మల్ రాజన్న అన్నారు. శనివారం వెల్మల్, కౌల్ పూర్ గ్రామాల్లో ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఆదేశాల మేరకు బూత్ కమిటీలను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. 5 వేల ఓటర్లకు గాను ప్రతి 60 మందికి ఒక ఇన్చార్జిని నియమించడం జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే జీవన్ రెడ్డి చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ యాభై వేల మెజారిటీ వచ్చేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. అనంతరం బూత్ కమిటీ సభ్యులకు గొడుగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు ,యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు చేసిన అభివృద్ధే

- టీడీపీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ఆరిఫ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు చేసిన అభివృద్ధి, వాటి నుండి ఏర్పడిన ఆర్థిక ఫలాలు నేడు కేసీఆర్ అనుభవిస్తూ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని టీడీపీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ఆరిఫ్ అన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ కార్యాలయంలో పార్లమెంట్ కమిటీ ప్రమాణ స్వీకారం ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని పార్లమెంట్ కమిటీ, నియోజకవర్గ ఇన్చార్జీలు, అనుబంధ సంఘ అధ్యక్షులతో ప్రమాణ స్వీకారం చేయించారు. నిజామాబాద్ పార్లమెంట్ కమిటీ అధ్యక్షులుగా దేగాం యదాగౌడ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షులు హబిబ్, తెలుగు యువత నాయకులు అన్వర్ హాజరయ్యారు. ఈసందర్భంగా రాష్ట్ర పార్టీ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. తెలుగువారి ఆత్మగౌరవం అనే నినాదంపై పుట్టిన పార్టీయే తెలుగుదేశం పార్టీ అని అన్నారు. ఈసందర్భంగా ఆరీఫ్ మాట్లాడుతూ..నందమూరి తారక రామారావు, ఆనాడే పటేల్ పట్వారి వ్యవస్థను రద్దుచేశార న్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో 119 నియోజకవర్గాలలో తెలుగుదేశం పార్టీ చేసిన అభివృద్ధిని ప్రజలలోకి తీసుకెళ్లి పోటీ చేస్తామని అన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షులు పావులూరు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి రెంజర్ల సురేష్, కోశాధికారి బ్రహ్మానంద చారి, కార్యనిర్వాహక కార్యదర్శి జ్యోతినారాయణ, సోమనారాయణరెడ్డి, అహ్మద్, కార్యదర్శులు గుర్జల రమేష్, విద్య సాగర్ చారి, జనార్ధన్ చారి, నియోజకవర్గ ఇన్చార్జిలు వినోద్ కుమార్, మహంకాళి రాజన్న, అనుబంధ సంఘ అధ్యక్షులు పాల్గొన్నారు.


ప్రమాణస్వీకారం చేస్తున్న పార్లమెంట్ కమిటీ సభ్యులు

ఇంగ్లీష్ సబ్జెక్టు బోధనకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ- జక్రాన్‌పల్లి

ఇంగ్లీష్ సబ్జెక్టు బోధించుటకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజేష్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాలలో 9, 10, ఇంటర్మీడియట్ ఫస్ట్, సెకండ్ ఇయర్ ఇంగ్లీష్ సబ్జెక్టు బోధించుటకు అన్ని అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునేవారు ఎంఏ ఇంగ్లీష్ మరియు బిఈడి లో మెథడాలజీ ఇన్ ఇంగ్లీష్ గల ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆసక్తిగల అభ్యర్థులు పాఠశాల సమయంలో ప్రిన్సిపాల్ ను సంప్రదించాలని సూచించారు.

జెంటిల్ కిడ్స్ పాఠశాలలో రెయిన్ డే సెలబ్రేషన్



రెయిన్‌డేలో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జెంటిల్‌కిడ్స్ ప్లే స్కూల్‌లో శనివారం రెయిన్ డే సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలందరూ పడవలు, గొడుగులు తయారుచేసి ప్రదర్శించినారు. వర్షంలో పిల్లలందరూ ఆనందంతో నృత్యాలు చేశారు. వర్షం యొక్క ప్రాధాన్యతను పాఠశాల కరస్పాండెంట్ గుజరాతి ప్రకాష్ ప్రిన్సిపాల్ లత విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఉరేసుకుని వివాహిత అత్మహత్య

నవతెలంగాణ-డిచ్‌పల్లి

అనుమానాస్పదంగా ఓ వివాహిత ఇంట్లో ఉరివేసుకొని అత్మహత్య చేసుకున్న ఘటన ఇందల్‌వాయి పోలీస్ నేషన్ పరిధిలోని గన్నారం గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఇందల్‌వాయి ఎస్‌ఐ ఎస్ మహేష్ వివరాల ప్రకారం మండలంలోని గన్నారం గ్రామానికి చెందిన కాసుల సవితకు 2008లో గన్నారం గ్రామానికి చెందిన కాసుల నాగేష్‌తో వివహమైంది. వీరికి ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. భర్త నాగేష్ బతుకు దెరువు కోసం గల్ఫ్ దేశానికి వెళ్లారు. ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇంట్లో ఉన్న తలుపులను బిగించుకుని చీరతో సీలింగ్ ఫ్యాన్ కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ మార్చురీకి తరలించినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి తల్లి ఇచ్చిని ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకోని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.


ఆత్మహత్య చేసుకున్న వివాహిత

వర్షంలో తడుస్తూ ఏఎన్‌ఎంల ధర్నా



ధర్నాలో పాల్గొన్న ఏఎన్‌ఎంలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం నాలుగవ రోజు సమ్మెలో భాగంగా ఏఎన్ఎం, ఈసీ ఏఎన్ఎంలు వర్షంలో తడుస్తూ పూలాంగ్ చౌరస్తావద్ద ధర్నా చేశారు. ఈసందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. ఓమయ్య, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు భాగ్యమ్మ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఆరోగ్య కార్యకర్తలు ఆందోళన చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం సరికాదన్నారు. చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించి సమ్మె నివారణకు కృషి చేయాలని డిమాండ్ చేశారు.కాలయాపన చేయకుండా సమస్య పరిష్కరించాలని లేనియెడల సమ్మెను ఎంతవరకైనా కొనసాగించడానికి సిద్ధంగా ఉన్నామని, జరిగే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు టీ .చక్రపాణి యూనియన్ జిల్లా కార్యదర్శి సంధ్యారాణి, సవిత కళావతి ,రాణి, సరస్వతి సావిత్రి, శశికళ, వనజ, మంజుల, సమత తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-మోపాల్

రుణమాఫీ జరిగినందున శనివారం మండలంలోని మంచిప్ప గ్రామంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి స్వీట్లు పంచుకున్నారు. జరిగింది. కర్షకుల ఆదుకున్నందుకు రైతులందరూ ఆయనకు ధన్యవాదాలు తెలిపారు వచ్చే ఎన్నికల్లో కూడా సీఎం కేసీఆర్ ని ముఖ్యమంత్రి చేసుకుంటామని, రైతు బాంధవుడని, రైతు బాధలు తెలిసిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రమేనని కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ యువత అధ్యక్షుడు సాయిరాం శ్రీనివాస్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు


పాలాభిషేకం చేస్తున్న నాయకులు

గంజాయి అమ్ముతున్న ముగ్గురు పట్టివేత


వివరాలను వెల్లడిస్తున్న ఎస్ఐ

నవతెలంగాణ-ఏర్గట్ల

గంజాయి అమ్ముతున్న ముగ్గురిని పోలీసులు శనివారం పట్టుకున్నారు. జగిత్యాల్ జిల్లా కొరుట్లకు చెందిన ముగ్గురు వ్యక్తులు తొర్తి గ్రామంలో గంజాయి అమ్ముతున్నారని సమాచారం అందడంతో వారిని అదుపులోనికి తీసుకున్నారు. వారిని విచారించి కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు. కానిస్టేబుళ్ల శ్రీధర్, తిరుమలేష్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలకేంద్రానికి చెందిన నారెడ్ల యమున భర్త నర్సయ్యకు 33వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎక్స్ సర్పంచ్ కాట్ పల్లి నర్సారెడ్డి శనివారం పంపిణీ చేశారు. మంజూరుకు సకరించిన ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు, ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు.

పలువురిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి



నవతెలంగాణ-ధర్పల్లి

మండలం మద్దుల్ తండా లో అనారోగ్యం తో బాధ పడుతున్న మాజీ సర్పంచ్ లింబాద్రి చౌహాన్, దత్తు నాయక్, శంకర్ నాయక్‌ను శనివారం మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి పరామర్శించారు. అయన వెంట మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బలరాజ్ ,డీసీసీ అధికార ప్రతినిధి చెలిమేల నర్సయ్య, జాని రెడ్డి, మంగిత్య నాయక్, నారవోయిన రాజేందర్, సుభాష్ రెడ్డి, శ్రీనివాస్, పద్మల్ రవి గౌడ్, రత్నాకర్ గౌడ్, గణేష్, వాల్గొట్ బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

కొండంత అండ ముఖ్యమంత్రి సహాయనిధి

- ఎంపీపీ రమేష్ నాయక్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు నిరుపేదలకు కొండంత అండగా ఉందని ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్ అన్నారు. శనివారం ఇందల్‌వాయి మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ఎల్లారెడ్డిపల్లి, మల్లాపూర్ గ్రామాలకు చెందిన పలువురు లాబ్దిదారులకు సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు లోలం సత్యనారాయణ, ఉప సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు రఘునథన్ రాము, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు చిలువెరి గంగాదాస్‌లతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్టీసీ ఛైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, డైనమిక్ లీడర్ యంగ్ టైగర్ బాజిరెడ్డి జగన్ మోహన్ ఆదేశాను సారం మల్లాపూర్ కోరట్పల్లి భూమేష్ 40 వేలు, లింగసముందర్ కు చేందిన ఉమా రాణికి 53000 వేల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పులి శ్రీనివాస్, సర్పంచ్ నరేష్, అరటి రఘు, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షులు బిరీష్ శెట్టి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


సీఎంఆర్ఎఫ్ అందజేస్తున్న ఎంపీపీ, ప్రజాప్రతినిధులు

ఎమ్మార్వోకు బీజేవైఎం వినతి


ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-నవీపేట్

బీజేవైఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల అధ్యక్షులు భాను గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మార్వో ధన్వల్‌కు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు పిల్లి శ్రీకాంత్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా నిరుద్యోగ భృతి, ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్, బలహీన వర్గాల విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అన్నారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వెంకట్ రెడ్డి, రామకృష్ణ, బిట్టు, ప్రశాంత్ గౌడ్, బండారి రాజ, అఖిల్, శ్రవణ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఫోన్ అప్పగింత

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని కల్వరాల్ గ్రామానికి చెందిన చిట్యాల బాల్ కిషన్‌కు ఎస్సై యస్.రాజు సెల్‌ఫోన్‌ను అప్పగించారు. సెల్‌ఫోన్ డిసెంబర్ నెలలో ఫిర్యాదు చేశారు. దరఖాస్తును సీఈఐఆర్‌ను దరఖాస్తులో అప్‌లోడ్ చేసి దానిని ట్రెస్ చేసి బాధితుడికి అప్పగించినట్టు పోలీసులు తెలిపారు. దీంతో బాధితుడు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.



ఫోన్ అప్పగిస్తున్న ఎస్ఐ

నేడు ఉచిత కంటి పరీక్ష శిబిరం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో మదన్ మోహన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉచిత కంటి పరీక్షలు, స్క్రీనింగ్ అవసరమైన వారికి ఉచిత కంటి అద్దాలు ఇస్తామని తెలిపారు. కంటి శిబిరం గ్రామంలోని చౌదరి బిల్డింగ్ గ్రామ పంచాయతీ ఎదురుగా నిర్వహిస్తారని తెలిపారు. సమయం 9.30 నుంచి 3 గంటల వరకు ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వర్షంలోనూ ఉత్సాహంగా 5కే రన్

- ప్రజాస్వామ్య పరిణతి చాటిన పలువురు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఓటు హక్కు ప్రాధన్యతను వివరిస్తూ ప్రజల్లో అవగాహన పెంచేందుకు భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో శనివారం 'ఐ ఓట్ ఫర్ షుఉర్' నినాదంతో 5కే రన్ నిర్వహించారు. బోధన్ పట్టణంలో ఉదయం 5కే రన్ నిర్వహించారు. శుక్రవారం రాత్రి నుంచి ఏకధాటిగా కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వివిధ వర్గాల వారు 5కే రన్‌లో పాల్గొని ప్రజాస్వామ్య పరిణతిని చాటారు. నిజామాబాద్ జిల్లాలోని బాన్సువాడ, బోధన్, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, బాల్కొండ శాసనసభా నియోజకవర్గాల పరిధిలో 5కే రన్ నిర్వహించారు. వర్షపు అడ్డంకిని అధిగమిస్తూ,



5కే రన్‌లో పాల్గొన్న పలువురు

వివిధ శాఖల అధికారులతో పాటు ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది, డ్వాక్రా సంఘాల సభ్యులు, యువజన సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, యువతీ యువకులు పెద్ద ఎత్తున 5కే రన్‌లో పాల్గొన్నారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు 5కే రన్ విజయవంతానికి కృషి చేశారు.

నియోజకవర్గాల వారీగా ఎన్నికల విభాగం అధికారులతో పాటు సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించి 5కే రన్ నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ఆయా నియోజకవర్గాల్లో అధికారులు అన్ని వర్గాల వారిని భాగస్వామ్యం చేస్తూ 5కే రన్ విజయవంతంగా నిర్వహించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అతి కీలకమైన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని అధికారులు ఈ సందర్భంగా సూచించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కొత్త ఓటర్ల నమోదు, మార్పులు చేర్పుల కోసం ఎన్నికల సంఘం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎలాంటి ప్రలోభాలకు తలొగ్గకుండా ఓటును వినియోగించుకోవాలని, ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్డీఓ రాజాగౌడ్, తహసీల్దార్ గంగాధర్, పట్టణ సీఐ ప్రేమ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైన్ షాపులో చోరీ..

- మద్యం, నగదు అపహరణ



చిందరవందరగా వస్తువులు

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రంలోని శ్రీ సిద్ధ రామేశ్వర వైన్స్‌షాపులో శుక్రవారం రాత్రి దుండగులు వైన్ షాప్ తాళాలు పగలగొట్టి మద్యం సీసాలు, నగదును అపహరించిన ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి దుండగులు వైన్ షాప్ తాళాలు పగులగొట్టి లోపలికి చొరబడి పది మద్యం సీసాలు, క్యాష్ కౌంటర్‌లో ఉన్న నగదును అపహరించారు. శనివారం ఉదయం వైన్స్‌షాప్ నిర్వాహకులు చూసేసరికి తాళాలు పగలగొట్టి దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దొంగతనం చేసిన దుండగులు వైన్స్‌షాప్‌లో ఉన్న సీసీ కెమెరాల బాక్స్ కూడా దొంగలించారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



తాడ్వాయి : నివాళులర్పిస్తున్న దృశ్యం



సదాశివనగర్‌లో..

నవతెలంగాణ-సదాశివనగర్/తాడ్వాయి

మండలంలోని వాసవి కళ్యాణ మండపంలో ప్రపంచ ఫొటో గ్రఫీ దినోత్సవాన్ని మండల ఫొటో గ్రాఫర్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఫొటో గ్రాఫర్ పితామహుడు లూయిస్ డాగురె ఫొటోకు పూలమాలలు వేసి జ్యోతిని వెలిగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సదాశివనగర్ సీఐ రామన్ ఆయన చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫొటోలు తీయడం అనేది మంచి కళగా వర్ణించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు డీకొండ శ్రీధర్, ప్రధాన కార్యదర్శి రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు ఉమాశేఖర్, సభ్యులు సాయిబాబా, లడ్డు, ఆశన్న, సతీష్, ప్రసాద్, సాంబ రవి, రాజు, వేణు, బద్దం రాజు, రంజిత్, శ్రీకాంత్, వంశీ, ఉపసర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి : మండల కేంద్రంలో ఫొటోగ్రఫీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగ్రే జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం ఆగస్టు 19వ తేదీన ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు ఫొటోగ్రఫీ యూనియన్ అధ్యక్షులు కృష్ణ చైతన్య గౌడ్ తెలిపారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా ఫొటోగ్రఫీ వేడుకలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తాడ్వాయి ఎస్ఐ ఆంజనేయులు పాల్గొని వారిని సన్మానించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు సిద్ధిరాములు, ప్రధాన కార్యదర్శి ప్రకాష్, క్యాషియర్ సంజీవులు, సభ్యులు శ్రీకాంత్, ప్రభాకర్, జగన్, నవీన్, శివ, బాలు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డిది
విలువలతో కూడిన రాజకీయం

- బోధన్ కిసాన్ సెల్ మండలాధ్యక్షులు రవి

నవతెలంగాణ-బోధన్

మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి చేసేది విలువలతో కూడిన రాజకీయాలని, పనికిరాని రాజకీయాలు కాదని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ బోధన్ మండలాధ్యక్షులు, హున్స సొసైటీ చైర్మెన్ మంధర్న రవి అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ సుదర్శన్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, వ్యక్తిగత విమర్శలు చేయడం సమంజసం కాదని వాటిని మానుకోవాలని హితవు పలికారు. తొమ్మిదిన్నర సంవత్సరాల కాలంలో ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ బోధన్ నియోజకవర్గంలో



మాట్లాడుతున్న రవి

ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి ఏమీ లేదని విమర్శించారు. ఎమ్మెల్యేకు జనంలో తిరిగే ధైర్యం లేదన్నారు. ప్రజలకు సేవ చేయమని 2 సార్లు ఎమ్మెల్యేగా గెలిపిస్తే తన స్వార్థ ప్రయోజనాల కోసం పదవిని అడ్డుపెట్టుకుని విదేశాలలో బిజినెస్‌లు చేస్తున్నారని ఆరోపించారు. వడగళ్ల వానలతో రైతులు పంటలు నష్టపోతే, అమ్మిన ధాన్యానికి గిట్టుబాటు ధర లేక ఎంతో నష్టపోయారని అయినా ఎమ్మెల్యే పట్టించుకోలేదని అన్నారు. మాజీ మంత్రి తాను చేసిన సేవలను ప్రచారం చేసుకోరని, ఆయనవి నైతిక విలువలతో కూడిన రాజకీయాలని అన్నారు. అభివృద్ధిపై ప్రశ్నిస్తే మైనారిటీలపై కేసులు బనాయించిన ఘనత మీదేనని అన్నారు. త్వరలోనే రైతులు తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని అన్నారు. నియోజకవర్గంలో ఏ ఒక్కరికి డబుల్ బెడ్ రూంలు ఇవ్వలేదని ప్రజలు వాపోతున్నారని అన్నారు. సమావేశంలో నాయకులు అల్లె రమేష్, నాగేశ్వరరావు, దేవురావు, రవీందర్ రెడ్డి, ప్రసాద్, సలీమ్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బాల్యం నుంచే జాతీయ భావం

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-తాడ్వాయి

బాల్యం నుంచే విద్యార్థులలో జాతీయ భావం పెంపొందించేందుకు జిల్లాలో గాంధీ చలన చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శిస్తున్నామని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ శనివారం తెలిపారు. స్వాతంత్ర వజ్రోత్సవాల ముగింపు కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్ర చలన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా గాంధీ చిత్రాన్ని ప్రదర్శిస్తున్నామని అన్నారు. శనివారం కామారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద, పిట్లం, నాగిరెడ్డిపేట్‌లోని (9) సినిమా హాళ్లలో చిత్ర ప్రదర్శన గావించగా 30 పాఠశాలకు చెందిన 4,571 మంది విద్యార్థులు ఆయా ఉపాధ్యాయులతో కలిసి ఎంతో ఆసక్తిగా చిత్రాన్ని తిలకించారని కలెక్టర్ తెలిపారు. 20న ఆదివారం సెలవు దినం సందర్భంగా చిత్ర ప్రదర్శన ఉండదని పేర్కొన్నారు. తిరిగి 21 నుంచి 24 వరకు పై థియేటర్లలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30



సినిమా చూసేందుకు వెళ్తున్న విద్యార్థులు

వరకు చిత్ర ప్రదర్శన ఉంటుందని ఆయన తెలిపారు. ఈ చిత్రాన్ని విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, పౌరులు కూడా తిలకించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.

సబ్బండ వర్గాలకు కేసీఆర్ ప్రభుత్వం అండ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-పిట్లం

సబ్బండ వర్గాలకు కెసిఆర్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రాజరాజేశ్వరి ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ వెనుకబడిన కుల వృత్తుల వారికి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల అభ్యున్నతికి గాను అందిస్తున్న దళిత బంధులాగా కులవృత్తులపైన ఆధారపడి జీవనం గడుపుతున్న బీసీ కులవృత్తులను ప్రోత్సహించాలని దృఢ సంకల్పంతో ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా ఒక్కో కుటుంబానికి లక్ష రూపాయలు అందిస్తుందని, లబ్ధి పొందిన చేతివృత్తుల వారు తమ కుటుంబాలను అభివృద్ధి బాటలో తీసుకెళ్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దఫేదర్ రాజు, నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శెట్పల్లి యువకునికి డాక్టరేట్ పట్టా

- ప్రొఫెసర్ ఖాసీం చేతుల మీదుగా

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని శెట్పల్లి గ్రామంలో ఓ రైతు కుటుంబంలో జన్మించిన బందరబోయిన శ్రీనివాస్ 'తెలంగాణా ఉద్యమంలో నిజామాబాద్ జిల్లా గేయ సాహిత్యం సమగ్ర పరిశీలన' అనే అంశంపైన పరిశోధన చేసి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టాను ఉస్మానియా ప్రొఫెసర్ ఖాసీ చేతుల మీదుగా పట్టా పొందారు. మండలంలోని శెట్పల్లి గ్రామంలో బందరబోయిన శివ్వవ్వ, దుర్గయ్య దంపతులకు జన్మించిన శ్రీనివాస్ చిన్ననాటి నుంచి భజన పాటలు, సాహిత్యంపైన మక్కువ పెంచుకున్నారు. ఒకటి నుంచి ఏడవ తరగతి వరకు శెట్పల్లి ప్రాథమిక పాఠశాలలో, 8వ



తరగతి నుంచి 10వ తరగతి వరకు లింగంపేట్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, తరువాత ప్రభుత్వ జూనియర్ కళాశాల లింగంపేట్‌లో ఇంటర్మీడియట్ పూర్తిచేసి, కామారెడ్డిలోని ఓరియంటల్ సాయం ప్రాశ్య కళాశాలలో డిగ్రీపూర్తి చేసి, తెలంగాణ విశ్వవిద్యాలయం నుంచి ఎంఏ తెలుగులో పట్టా అందుకున్నారు.ఒకవైపు విద్యాభ్యాసం చేస్తూనే శ్రీనివాస్ ఎన్నో రచనలు చేస్తూ, పాటలు రాస్తూ, పాడుతూ, ప్రజలలో ఎంతో సామాజిక స్పృహను కలిగిస్తున్నారు. పలు పుస్తకాలను రచనలు చేశారు. పాటలు పాడారు. ఆటలు ఆడారు. ప్రభులింగశతకం, అమ్మ మెచ్చు భావాలు, తెలంగాణా పోరుపాట సీడీ రూపంలో ప్రభుస్వామికి అక్షరాభిషేకం (సీడీ రూపంలో) ఇవే కాకుండా అనేక దిన, వార, మాస పత్రికలలో పాటలు, గేయాలు, కవితలు ప్రచురితమయ్యాయి. శెట్టిపల్లి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన శ్రీనివాస్‌కు డాక్టర్ పట్టారావడంతో ఈ విషయం తెలిసిన గ్రామస్తులు మిత్రులు, శ్రీనివాస్‌కు అభినందనలు తెలిపారు.

బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లోకి మద్దికుంట ఎంపీటీసీ



బీఆర్ఎస్‌లో చేరుతున్న ఎంపీటీసీ

నవతెలంగాణ-రామారెడ్డి

కేసీఆర్ పథకాలకు ఆకర్షితులై, బీజేపీ చేస్తున్న మతతత్వం, దళితులపై చిన్న చూపును నచ్చక బీజేపీకి రాజీనామా చేసి, శనివారం ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో మద్దికుంట ఎంపిటిసి గజ్జల రాజేందర్ చేరినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దశరథ్ రెడ్డి, వైస్ ఎంపీపీ రవీందర్‌రావు, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు బొమ్మిడి రామ్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సలావత్ బుచ్చిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రాజేందర్ తదితరులున్నారు.

కేకేసీ కోఆర్డినేటర్ల నియామకం



నియామకపత్రాలను అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఎడపల్లి

బోధన్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాంగ్రెస్ కెప్టెన్ సి.కరుణాకర్‌రెడ్డి (నేషనల్ కోఆర్డినేటర్, తెలంగాణ ప్రదేశ్ కేకేసీ ఇంచార్జ్), తెలంగాణ ప్రదేశ్ చైర్మన్ కౌశల్ సమీర్ ఆదేశాల మేరకు, కేకేసీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఎడపల్లి మాజీ సర్పంచ్ నాయుడు రాచర్ల భాస్కర్‌రాజ్, జిల్లా చైర్మన్, గణపురం రవి నవీపేట్ మండలం కేకేసీ కోఆర్డినేటర్ ఆధ్వర్యంలో వై.శ్రీకాంత్‌ను నవీపేట్ కేకేసీ కోఆర్డినేటర్‌గా, లింగాపూర్ గ్రామానికి చెందిన జి.రాజును లింగాపూర్ గ్రామ కేకేసీ కోఆర్డినేటర్‌గా నియమించి ఇరువురికి నియామకపత్రాలను కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా బోధన్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి మాట్లాడారు.. నియోజకవర్గ పరిధిలోని గ్రామగ్రామాన కాంగ్రెస్ పార్టీ బలోపేతనానికి యువకులే కీలకమని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి సూచన మేరకు పార్టీ బలోపేతనానికి తన వంతు కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి ఆశ బాగా వ్యక్తం చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు కేకేసీ నాయకులు ఉన్నారు.

వ్యాధిగ్రస్తుల గుర్తింపు కోసం ఇంటింటి సర్వే

నవతెలంగాణ-రాజంపేట్/మాచారెడ్డి

ప్రజలు అనారోగ్య బారిన పడకుండా ప్రతి ఇంటికి తిరుగుతూ వారి ఆరోగ్య పరిస్థితిని ఆశావర్కర్లు సర్వే నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం మండల కేంద్రంలో సర్వే నిర్వహించారు. ఆరోగ్య విస్తీర్ణ సూపర్వైజర్ మాట్లాడుతూ.. తెల్ల మచ్చలు, కుష్టి వ్యాధి లక్షణాలు ఇతర వ్యాధులు రాకుండా ప్రతి ఇంటికి వెళ్లి పరిశీలించి వ్యాధి బారిన పడిన వారికి వైద్యుల సలహా మేరకు తగు సూచనలు సలహాలు అందిస్తున్నామని తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామంలో ఈనెల 16 తేదీ నుంచి 30వ తేదీ వరకు ఆశావర్కర్ ద్వారా సర్వే నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ గంగామణి ఏఎన్ఎంలు, ఆశావర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

మాచారెడ్డి : కుష్టు వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు ఈనెల 16వ తేదీ నుంచి కొనసాగుతున్న ఇంటింటి సర్వే శనివారం సైతం మండల కేంద్రంలో చేపట్టారు. ఆశా కార్యకర్తలు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎవరికైనా అవాంఛిత మచ్చలు ఉన్నవారిని గుర్తించి వివరాలను సేకరిస్తున్నారు. మండలంలో ఈ నెల 31వ తేదీలోపు సర్వే పూర్తి చేస్తామని ఆశావర్కర్లు తెలిపారు.



మాచారెడ్డి : సర్వే చేపడుతున్న దృశ్యం

రాష్ట్రస్థాయి ఉత్తమ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నంద రమేష్



ప్రశంసాపత్రం అందుకుంటున్న నంద రమేష్

నవతెలంగాణ-భిక్కనూర్

రాష్ట్రస్థాయి ఉత్తమ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నంద రమేష్‌ను ఎంపిక చేసి శనివారం ప్రశంసాపత్రాలు అందజేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో ఉత్తమ సేవలు అందించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లను ఎంపిక చేయగా అందులో జిల్లాలోని భిక్కనూర్ పట్టణానికి చెందిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ నంద రమేష్ ఉత్తమ సేవలను గుర్తించి డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూటర్ లక్ష్మీ నరసయ్య నంద రమేష్‌కు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా తోటి పబ్లిక్ ప్రాసిక్యూటర్లు నంద రమేష్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు అశోక్ కుమార్, దామోదర్ రెడ్డి, శేషు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

21న విద్యాశాఖ మంత్రి సబిత ఇంద్రారెడ్డి రాక

- ఎంపీపీ ప్రతాప్ రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీపీ

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మన ఊరు మన బడి కార్యక్రమంలో నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభించేందుకు విద్యాశాఖ మంత్రి సబిత ఇంద్రారెడ్డి, ఎంపీ బీబీ పాటిల్, జడ్పీ చైర్మన్ శోభ రాజు, ఎమ్మెల్యే హన్మంత్ షిండే రానున్నారని ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సొసైటీ చైర్మెన్లు, రైతుబంధు సమన్వయ అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, ఈ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు చాలామంది ఉన్నత స్థాయిలో ఉన్న వాళ్ళు కూడా ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ రావాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, సర్పంచుల మండల అధ్యక్షులు తిరుమలరెడ్డి, సొసైటీ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, ప్రేమ్‌సింగ్, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

నుడా చైర్మన్‌కు ఘన సన్మానం



నుడా చైర్మెన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఎడపల్లి

తెలంగాణ రాష్ట్ర నుడా చైర్మన్‌గా నియమితులైన నిజామాబాద్ జిల్లా వాసి ఈగ సంజీవరెడ్డిని ఎడపల్లి మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు పోల మల్కారెడ్డి శనివారం ఈగ సంజీవరెడ్డి నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం సంజీవరెడ్డికి పూల బొకే అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న నాయకులను గుర్తించి గౌరవ ప్రదమైన పదవులలో నియమించడం హర్షనీయమని పోల మల్కారెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్ డిక్లరేషన్ ప్రచార సమన్వయకర్తల నియామకం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ అర్బన్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటరు ధ్రువీకరణకు సంబంధించి వివిధ కాంగ్రెస్ డిక్లరేషన్లను ప్రచారం చేయడానికి బొబ్బిలి రామకృష్ణ, ఎండి. మాజీద్ ఖాన్‌లను సమన్వయకర్తలు(కోఆర్డినేటర్స్)గా శనివారం నియమించారు. ఈ నియామకాన్ని తక్షణమే అమలులోకి వచ్చేలా ఎ. రేవంత్ రెడ్డి, ఎంపీ అండ్ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ధ్రువీకరించారు. ఈ సందర్భంగా బొబ్బిలి రామకృష్ణ, మాజీద్ ఖాన్ మాట్లాడుతూ.. తమ నియామకానికి కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్ ఫోన్లు అప్పగింత

నవతెలంగాణ-ఆర్మూర్



పోలీస్ స్టేషన్ పరిధిలో గత కొద్ది కాలంగా దొంగతనం నకు గురైన పడిపోయిన 10 మొబైల్ ఫోన్లు సి ఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి సంబంధిత వ్యక్తులకు శనివారం అందజేసినట్టు స్టేషన్ హౌస్ ఆఫీసర్ సురేష్ బాబు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సిఈఐఆర్ ఆధారంగా ఫోన్లను ట్రేస్‌చేసి బాధితులకు అందజేసినట్టు తెలిపారు.

20ఏండ్ల సర్వీస్‌లోని ఏఎన్ఎంలు పరీక్ష రాయాలా..?

సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

20ఏండ్లు సర్వీస్ చేసిన ఏఎన్ఎంలు ఇప్పుడు పరీక్ష రాయాలా? అని సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ అన్నారు. శనివారం నిజామాబాద్ జిల్లాలో ధర్నా చౌక్ వద్ద వర్షంలో కూడా ఏఎన్ఎంలు నిరసన కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా నూర్జహాన్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం వస్తే కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేస్తానని కెసిఆర్ హామీనిచ్చి ఏడు సంవత్సరాలు గడిచిపోయిన అమలు కాలేదన్నారు. అది గుర్తు చేయడానికి ఏఎన్ఎంలందరూ ఆగస్టు 15న జెండా ఆవిష్కరణ అనంతరం సమ్మెబాట పట్టారని తెలిపారు. పరాయి పాలనలో అదేతీరు.. మన పాలనలో అదే తీరని, పాలకులు మారిన బతుకులలో మార్పు రాలేదని అన్నారు. తెలంగాణ వస్తే పర్మినెంట్ అవుతామని, ఉద్యోగ భద్రత ఉంటుందని అనుకున్నారని తెలిపారు. అదే చాకిరి.. అదే పని భారంతో నలుగుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంపిహెచ్ఎ(ఎఫ్) పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్



వర్షంలో నిరసన తెలుపుతున్న ఏఎన్ఎంలు

2/2023ను జారీ చేసిందని, 1,520 పోస్టుల భర్తీకోసం రాతపరీక్ష నిర్వహించి ఎంపిక చేస్తామని, కాంట్రాక్ట్ సర్వీస్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు 20మార్కులు సర్వీస్ వెయిటేజి ఇచ్చారని అన్నారు. మిగిలిన 80 మార్కులు పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. నోటిఫికేషన్ ప్రకారం 49 ఏండ్లు దాటిన వారు అప్లై చేసుకోవడానికి కూడా అర్హులు కారని అన్నారు. ఈ నిబంధనల వల్ల కాంట్రాక్ట్ సర్వీసులో పనిచేస్తున్న 2వ ఏఎన్ఎం, ఇసి ఏఎన్ఎం, అర్బన్ హెల్త్ సెంటర్స్, ఏఎన్ఎంలు, హెచ్ఆర్డి ఏఎన్ఎంల పేరిట పనిచేస్తున్న సుమారు 5వేల మందికి న్యాయం జరగదని అన్నారు. వీరందరూ 20 ఏండ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారు. వీరిందరినీ యదావిధిగా ఖాళీ పోస్టుల్లో సీనియారిటీ ప్రకారం రెగ్యులర్ చేయడం వల్ల న్యాయం జరుగుతుందన్నారు. గతంలో వీరంతా డిఎస్సి ద్వారా రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్, మెరిట్ ప్రకారం ఎంపికై పని చేస్తున్నారని అన్నారు. మళ్ళీ పరీక్ష రాయమనడం న్యాయం కాదని, ఇప్పటికే చాలా మందికి ఏజ్ బార్ అయిందని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషను రద్దు చేయాలని కాంట్రాక్ట్ ఉద్యోగులు కోరుకుంటున్నారని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖలోని కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసుల క్రమబద్ధీకరణకు సంబంధించి విధి విధానాల విషయంలో ద్వంద్వ ప్రమాణాలు అనుసరించడం శోచనీయమని తెలిపారు. కాంట్రాక్ట్ మెడికల్ ఆఫీసర్లను మెరిట్ ఆధారంగా సర్వీసుకు వెయిటేజి ఇచ్చి రెగ్యులర్ చేశారని అన్నారు. జీఓ నెం. 16 26-02-2016 ప్రకారం కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌కు సంబంధించి మన డిపార్ట్‌మెంట్లో తేదీ: 03-05-2023న జీఓ నెం.49 ప్రకారం 68 మంది కాంట్రాక్ట్ ఎంపిహెచ్ఎ (ఫిమేల్)ను యదావిధిగా రెగ్యులర్ చేశారని తెలిపారు. మిగిలిన 5 వేల మంది కాంట్రాక్ట్ ఎంపిహెచ్ (ఫిమేల్)లను సీనియారిటీ ప్రకారం ఖాళీ పోస్టులలో రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సరోజ, ధనం, సుశీల, రాధ, ప్రమీల, సునీత, విజయ, సావిత్రి, అరుణ, విజయ, రమ, కవిత, వనిత, సుశీల, విమల, రాణి, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-బాల్కొండ

2023-24 విద్యాసంవత్సరానికిగాను తెలంగాణ స్టేట్ ఓపెన్ స్కూల్ ఆధ్వర్యంలో ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతున్నదని బాల్కొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇందిర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టెన్త్ లోపు మధ్యలో మాని వేసిన వారు, టెన్త్ పాసై ఇంటర్ మాని వేసినవారు మళ్లీ చదువు కొనసాగించాలని అనుకుంటున్నా వారు ఈ సదవకాశాన్ని వినిగించుకోవాలని ఆమె కోరారు. ప్రవేశాలకు ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు జడ్పిహెచ్ఎస్ బాల్కొండ ఓపెన్ స్టడీ సెంటర్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ దేవేందర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ పథకాలను గడప గడపకు తీసుకెళ్ళాలి

- బీఆర్ఎస్ మండలాధ్యక్షులు పూర్ణానందం



మాట్లాడుతున్న మండలాధ్యక్షులు పూర్ణానందం

నవతెలంగాణ-ఏర్గట్ల

మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు పూర్ణానందం ముఖ్య కార్యకర్తలు, నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి చేసిన అభివృద్ధిని, ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు గడప గడపకు తీసుకెళ్ళాలని అన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డిని రాబోయే ఎన్నికల్లో అంతకు ముందు కంటే ఎక్కువ మెజార్టీతో గెలిపించాలని అన్నారు. ప్రజలతో మమేకమై గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే కార్యకర్తలు, నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్ళాలని అన్నారు. ప్రతి పక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని సూచించారు. ప్రజలకు అందే సంక్షేమ ఫలాలు అందరికి అందుతున్నాయో లేదో తెలుసుకుని వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపేందర్ రెడ్డి,జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్, ఎంపీటీసీ జక్కని మధుసూధన్, కుండ నవీన్, పత్తిరెడ్డి ప్రకాష్, ఏర్గట్ల, తాళ్ళ రాంపూర్ పీఏసీఎస్ అధ్యక్షులు బర్మ చిన్న నర్సయ్య, పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి,అష్రాఫ్,నెరేళ్ళ లింగారెడ్డి, తుపాకుల శ్రీనివాస్ గౌడ్,బద్దం ప్రభాకర్,నాగిరెడ్డి రాజేందర్, బొమ్మకంటి శ్రీనివాస్,తాహెర్,గద్దె గంగారాం, బాంపెల్లి గంగాధర్, చిలుక కిషన్, కుమ్మరి సహదేవ్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న సునీల్‌రెడ్డి

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని తొర్తి గ్రామానికి చెందిన ధ్యావర శెట్టి లక్ష్మీ నర్సయ్య గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చనిపోయారు. ఆయనకు భార్య, ఇంటర్మీడియట్ చదవుతున్న ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబం పెద్దదిక్కును కోల్పోవడంతో వారి కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు ముత్యాల సునీల్ రెడ్డి పరామర్శించి ధైర్యాన్ని కల్పించారు. ఆర్థిక సహాయం కింద 10 వేల రూపాయలను అందజేశారు. సునీల్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రేస్ ప్రభుత్వం ఏర్పడితే పేదలకు న్యాయం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు సోమ దేవరెడ్డి,జిల్లా కాంగ్రేస్ ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివకుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆడేం గంగాప్రసాద్, బద్దం లింగారెడ్డి, మహేష్, భూమేష్, షఫీ, గంగమోహన్, తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రకు సిద్ధమవుతున్న పైడి రాకేష్ రెడ్డి



నవతెలంగాణ-ఆర్మూర్

ప్రము ఖ పారిశ్రామికవేత్త బిజెపి నాయకులు పైడి రాకేష్ రెడ్డి గ్రామ గ్రామాన పాదయాత్రకు సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆగస్టు చివరి వారం కల్లా బహిరంగ సభతో ప్రారంభించే యోచనలో ఉన్నట్లు తెలిసింది. మండలానికి ఓ మినీ సభా ఏర్పాటు ఏర్పాటు చేసిఆర్మూర్ నియోజకవర్గంలోని 60 గ్రామాలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు వినికిడి. ఎంపీ అరవింద్‌తో పార్టీ ముఖ్య నాయకులతో చర్చించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా నాయకులు పైడి రాకేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం తొమ్మిది సంవత్సరాలలో నెరవేర్చని హామీలను, వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ వారిని చైతన్య పరుస్తామని, గ్రామ గ్రామాన తిరుగుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. బహిరంగ సభకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఈటెల రాజేందర్ తదితరులు హాజరయ్యే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

నాలుగవ రోజుకు సమ్మె

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలో ఏ ఐ టి యు స ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె శనివారంతో నాలుగో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికుల సంఘం అధ్యక్షులు బాబురావు మాట్లాడుతూ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి. మున్సిపల్ కమిషనర్, చైర్మన్ మున్సిపల్ కార్మికుల మీద దయ తలచి ఇప్పటికైనా సమాన పనికి సమాన వేతనం 26000 ఇప్పించాలని కోరారు. 12వ పిఆర్సి ప్రకారం కమిటీ వేయించి మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని అన్నారు. కార్యక్రమంలో సభ్యులు రఫీ అశోక్ అబ్బాస్ ప్రసాద్ ఎన్ నరసయ్య ప్రవీణ్ అక్షయ్ బాబర్ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

21న జరిగే కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయండి

- ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఈనెల 21న జరిగే ఎస్ఎఫ్ఐ జిల్లా కలెక్టరేట్ ముట్టడిని విద్యార్థులంతా విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు. ఈ మేరకు శనివారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక నాందేవ్ వాడ జిల్లా కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బోడ అనిల్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అయిలాపూర్ ఎస్సీ హాస్టల్‌కు పక్కా భవనాలు నిర్మించాలని, అనేక హాస్టల్స్ శిథిలావస్థలో ఉన్న విద్యాశాఖ అధికారులు పట్టించుకోక పోవడం విడ్డూరమని అన్నారు. పెండింగ్‌లో ఉన్న 5177 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్స్, స్కాలర్ షిప్స్ విడుదల చేయాలని అన్నారు. విద్యార్థులకు యునిఫామ్స్, పాఠ్యపుస్తకాలు, గురుకులాలు, హస్టల్స్, కెజిబివిల విద్యార్థులకు నోట్ పుస్తకాలు తక్షణమే అందించాలని వాపోయారు. పెండింగ్‌లోఉన్న మధ్యాహ్న భోజనం బిల్లులు విడుదల చేసి, మధ్యాహ్న భోజన పథకానికి అధిక నిధులు పెంచాలని అన్నారు. మన ఉరు-మన బస్తీ-మనబడి పథకాన్ని అన్ని పాఠశాలలకు వర్తింపజేయాలని, ఇంటర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం అమలు జరపాలని అన్నారు. పెండింగ్ మెస్, కాస్మోటిక్ ఛార్జీల బిల్లులు విడుదల చేయాలని, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని, అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకులాలు, కెజిబివిలు, కళాశాల వసతిగృహాలు, హాస్టల్స్‌కు సొంత భవనాలు నిర్మించాలని తెలిపారు. జిల్లాలో ఖాళీగా ఉన్న



సమావేశంలో మాట్లాడుతున్న అనిల్

ఎంఈఓ పోస్టులు భర్తీ చేసి, ఖాళీ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, ప్రతి విద్యాసంస్థలో టాయిలెట్స్ నిర్మించి, స్కావెంజర్స్ పోస్టులను భర్తీ చేయాలని అన్నారు. లేకపోతే ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాచకొండ విఘ్నేష్, జిల్లా నాయకురాలు దీపిక, నాయకులు శివ, సంతోష్, తదితర నాయకులు పాల్గొన్నారు.

సివిల్ ఎస్సైగా ఎంపికైన యువకుడికి సన్మానం



సివిల్ ఎస్ఐగా ఎంపికైన యువకుడితోపాటు కుటుంబీకులను సన్మానిస్తున్న సర్పంచ్, ఉపసర్పంచ్

నవతెలంగాణ-బాల్కొండ

బాల్కొండ మండలం ఇత్వార్‌పేట్ గ్రామానికి చెందిన గద్దల సంజయ్ ఇటీవల వెల్లడైన ఎస్సై ఫలితాల్లో సివిల్ ఎస్సైగా ఎంపికైన సందర్భంగా శనివారం సర్పంచ్ సంతకుల సాయమ్మ జువ్వన్న, ఉపసర్పంచ్ పస్తం చిన్న రాజన్న ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంజయ్ సివిల్ ఎస్సైగా ఎంపికై తమ గ్రామానికి మంచి పేరు తీసుకువచ్చారన్నారు. సంజయ్ ఎస్సైగా పేరు ప్రఖ్యాతలు సాధించి ఉన్నతమైన స్థానాలకు ఎదగాలని వారు కోరారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు దొనకంటి రాజేశ్వర్, మోహన్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అనుభూతుల్ని పదిలంచేసేది

- ఘనంగా అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం



వతెలంగాణ-సిరికొండ

మండల ఫోటోగ్రాఫర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ ఫొటోగ్రఫి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉపాధ్యక్షుడు ఆనంద్ మాట్లాడుతూ.... ఫోటో గ్రఫీ అనేది రెండు గ్రీకు పదాల కలయిక అని, ఫోటో అంటే చిత్రం, గ్రఫీ అంటే గీయడం,అంటే కాంతితో చిత్రం గీయడమని అన్నారు. 12 శతాబ్దంలో ఫారిన్లో నలుపు, తెలుపుతో ప్రారంభమైన ఫోటోగ్రఫి కాలక్రమంలో రంగులు అద్దుకుంటూ, కొత్తపుంతలతో కదం తొక్కుతుందన్నారు. ఏదేమైన ఫోటో అంటే తీయని జ్ఞాపకం, ఎన్నో అందమైన అనుభూతుల్ని పది కాలాల పాటు నిక్షిప్తం చేసేదీ ఫొటో అని అన్నారు. కార్యక్రమంలో మండల ఫొటోగ్రాఫర్ యూనియన్ అధ్యక్షులు బాపురావ్,ఉపాధ్యక్షులు ఆనంద్,మరియు శ్రీకాంత్, శ్రీనివాస్, రంజిత్, తిరుపతి, రాజు, రత్నాకర్, శ్రీకాంత్, రణధీర్ తదితరులు పాల్గొన్నారు.

సుదర్శన్ రెడ్డిపై అవాక్కులు, చెవాక్కులు మానుకోవాలి

- తీవ్ర పరిణామాలు తప్పవు
- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డిపై అవాక్కులు, చెవాకులు మానుకోవాలని, లేకుంటే బీఆర్ఎస్ నాయకులు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి మండిపడ్డారు. శనివారం కాంగ్రెస్ భవన్ నందుకాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, పిసిసి ఉపాధ్యక్షులు తాహెర్ బిన్ హందాన్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. కల్వకుంట్ల కవిత, బోధన్ ఎమ్మెల్యే షకీల్ కాంగ్రెస్ పార్టీ నాయకులైన సుదర్శన్ రెడ్డిపై, కాంగ్రెస్ పార్టీపై చేసిన అనుచిత వాక్యాలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. సుదర్శన్ రెడ్డి ప్రజలకు ఉపయోగపడే పనులు చేస్తే షకీల్ తొమ్మిది సంవత్సరాలుగా ప్రజల డబ్బును ఎలా దోచుకోవాలనే చూస్తున్నాడని, దానికి కల్వకుంట్ల కవిత సహాయం చేస్తుందని ఆయన అన్నారు.బోధన్



మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి

నియోజకవర్గంలో యంత్రాలు కూడా లేని రైస్ మిల్లులకు వడ్లను కేటాయించిన అవినీతి వ్యక్తివని, ఎలక్షన్లకు ముందు వాటిని బినామీల పేర్లకు మార్చిన అవినీతిపరుడు షకీల్ అని మానాల మోహన్ రెడ్డి అన్నారు. సుదర్శన్‌రెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధి పైన షకీల్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు జరిగిన అభివృద్ధిపైన కాంగ్రెస్ పార్టీ చర్చకు సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే షకీల్ కు సవాల్ విసిరారు. 90 రోజుల తర్వాత వచ్చే ఎన్నికల్లో బోధన్ నియోజకవర్గంలో సుదర్శన్ రెడ్డి గారు ఎమ్మెల్యేగా గెలుస్తారని, ఆ తర్వాత షకీల్ చేసిన అవినీతి పైన విచారణ జరిపిస్తామని ఆయన అన్నారు. కల్వకుంట్ల కవితకు కాంగ్రెస్ రాహుల్ గాంధీపై మాట్లాడే నైతిక హక్కు లేదని, కల్వకుంట్ల కవిత లిక్కర్ స్కాంలో ముద్దాయిగా ఉన్నట్టు రాహుల్ గాంధీ ఎలాంటి స్కామ్ లో లేరని అన్నారు. రాబోయే కాలంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని టిఆర్ఎస్ నాయకులు చేసిన అవినీతి పై విచారణ జరిపిస్తామని మానాల మోహన్ రెడ్డి అన్నారు.ఈ సందర్భంగా పిసిసి ఉపాధ్యక్షులు తాహెర్బిన్ హందన్ మాట్లాడుతూ.. ఎన్నికలలో తప్పుడు హామీలతో గెలిచినవారు షకీల్ అని, షకీల్ ఎమ్మెల్యే కాకముందు మీ ఆస్తులు ఎన్ని ఇప్పుడు మీకున్న ఆస్తులు ఎన్ని అని ఒక్కసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలని అన్నారు. దొంగ పాస్పోర్టులు సృష్టించి అమాయక ప్రజలను విదేశాలకు పంపిన వ్యక్తి మీరని, దొంగ పాస్పోర్టులపై షకిల్ పై కేసు నమోదు అయితే అండర్ గ్రౌండ్‌కు వెళ్లిన వ్యక్తి షకీల్ అని అన్నారు. బోధన్ నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందని కవిత, షకీల్ చెప్తున్నారు కానీ పేద కాంట్రాక్టర్ లకు చెల్లించాల్సిన బిల్లులను పెండింగ్‌లో పెట్టారని అన్నారు. సమావేశంలో మాజీ బిసి సెల్ అధ్యక్షులు శేఖర్ గౌడ్,జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు ముప్ప గంగారెడ్డి,జిల్లా ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు వేణు రాజ్,జిల్లా ఓబీసీ అధ్యక్షులు రాజ నరేందర్ గౌడ్, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సంతోష్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గంగారెడ్డి పాల్గొన్నారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు తీర్పులపై న్యాయసలహాలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జి. వైజయంతి ఆదేశాల మేరకు శనివారం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పి. లక్ష్మి నర్సయ్య, నిజామాబాద్ / కామారెడ్డి జిల్లాలోని కోర్టులో విధులు నిర్వహిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశములో వైట్ కాలర్ నేరాలు ఎలక్ట్రిసిటీ చట్టాల గురించి కేసులలో తీసుకొనవలసిన జాగ్రత్తల గురించి పబ్లిక్ ప్రాసిక్యూటర్ యం.డి. రహిమోద్దీన్, భూసారపు రాజేష్ గౌడ్, అశోక్ శివరాం నాయక్ డా? సమ్మయ్య లు తెలిపారు.ప్రతి పబ్లిక్ ప్రాసిక్యూటర్ తన విధులను శ్రద్ధతో నిర్వహించి, నేరస్తులకు శిక్షపడేటట్లు కృషి చేయాలని కోరినారు. ఉమ్మడి జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మి నర్సయ్య కి తమకు అన్ని వేళలో ఎటువంటి అపోహలు ఉన్నా, న్యాయసలహాలు తెలియపరుస్తున్నందున వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలోనే అత్యధిక కేసులలో శిక్షపడేటట్లు కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ పి. రవిరాజ్, కవితారెడ్డి, నంద రమేష్, డా? సమ్మయ్య ల ను తోటి ప్రాసిక్యూటర్స్, అభినందించారు. ఈ సమావేశంలో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు యం.డి. రహిమోద్దీన్, భూసారపు రాజేష్ గౌడ్,



హాజరైన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు

అశోక్ శివరాం నాయక్, చిదిరాల రాణి, వీరయ్య, పొరిక రాజేశ్వరి, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రాజ్ గోపాల్ గౌడ్, నంద రమేష్, కే. శేషు, నిమ్మ దామోదర్ రెడ్డి, డా? సమ్మయ్య, తదితరలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలం లోని తొర్లికొండ ప్రాథమిక పాఠశాలతో పోలింగ్ కేంద్రాలను మండల సర్వేయర్ రత్నాకర్ శనివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు అనుకూలమైన గదులను చూసి ఒక కేంద్రాన్ని ఎంపిక చేశారు. సర్వేయర్ వెంట జూనియర్ అసిస్టెంట్ దామోదర్ ఉన్నారు.

బీసీ సంక్షేమ హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి

- పీడీఎస్‌యూ ఏరియా కమిటీ నాయకులు
- బీసీ వెల్ఫేర్ ఆఫీసర్‌కు వినతి

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలో ఉన్న బిసి గర్ల్స్ కాలేజ్ సంక్షేమ హాస్టల్ వార్డెన్ పై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఏరియా అధ్యక్షులు అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి నిఖిల్ మాట్లాడుతూ.. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఏరియా కమిటీ ఆధ్వర్యంలో ఆర్మూర్ పట్టణ కేంద్రంలోగల బీసీ బాలికల వసతి గృహం కాలేజ్ హాస్టల్‌లో ప్రభుత్వం ఇచ్చిన మెనూ నీ పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేయడం జరుగుతుందని అన్నారు. ఎవరైనా మెనూ ప్రకారం భోజనం పెట్టాలని అడిగితే ఎంత చెప్పిన వినకుండా నాకు నచ్చిన విధంగానే పెట్టుత అనే విధంగా మాట్లాడుతున్నారని అన్నారు. విద్యార్థిను లకు ఫోన్ ద్వారా ఇబ్బందులు పడుతారని, చెప్పిన కాలేజ్ లో వారి విద్యకు సంబంధించిన వాటిని హాస్టల్ కంప్యూటర్ ద్వారా పరిష్కరించండి అని విన్నవించిన ఆ విశయన్ని పరిగణలోకి తీసుకోకుండా విద్యార్థులకు సెల్ ఫోన్లు వాడటానికి పర్మిషన్ ఇస్తు వారి భవిష్యత్తు పాడు చేస్తున్న వార్డెన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని వార్డెన్ హాస్టల్ సమయం పాటించకుండా తనకు నచ్చిన టైంలో రావడం ఇష్టం ఉన్నప్పుడు వెళ్లడం జరుగుతుందని అన్నారు. ఏ రోజు కూడా పూర్తిగా తను హాస్టల్లో ఉండదని వారు తెలిపారు. బాలికల వసతి గృహంలో బయటి వ్యక్తులు, అబ్బాయిలు కూడా వస్తున్న అక్కడ సిబ్బంది, వార్డెన్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. వచ్చిన అబ్బాయిలు కూడా అసభ్య కరమైన దుస్తులతో వస్తున్నారని అన్నారు. విద్యార్థులు ఏదైనా సమస్యల గురించి చెప్పిన భయపెట్టిన సందర్భాలు ఉన్నాయని, ఆ విద్యార్థులు భయపడి హాస్టల్ నుండి వెళ్లిపోయిన సందర్భాలు కూడా ఉన్నాయని గుర్తు చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఉన్నతాధికారులను కలిసి పోరాటం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షులు నవీన్ నాయకులు నితిన్, అరవింద్ ,మహిపాల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ మానవతా దినోత్సవం

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రపంచ మానవతా దినోత్సవాన్ని ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం అన్నదానం నిర్వహించారు. విపత్కర పరిస్థితుల్లో సహాయం అందించటంలో ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ఎప్పుడు ముందుంటుందని ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మద్దుకూరి సాయిబాబు తెలిపారు. కష్టకాలంలో ఉన్న వారికి చేయుతగా పిలిచినప్పుడే నిజమైన మానవత్వాన్ని చాటుకున్నవారిమి అవుతామన్నారు. క్యాన్సర్ ఆస్పత్రికి వచ్చే రోగులకు, వారి సహాయకులకు నిరంతరం అన్నదానం చేయడంతోపాటు రోడ్లపై నిస్సహాయ స్థితిలో ఉన్న అనాథలకు మతిస్థిమితం లేని విధివంచితులకు నిరాశ్రయులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.